
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 17 ఏప్రిల్ 2025



అందని పౌష్టికాహారం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో నిండుకున్న సరుకులు
- నెల రోజులుగా కోడిగుడ్లు, పాలు, కందిపప్పు, అల్పాహారం బంద్
- ఇబ్బందుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

7



ఆమె లేదు.. ఆమె ప్రతిభ ఉంది!




దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినికి అరుదైన గుర్తింపు

- అశ్విని పేరుతో పూస శనగ వంగడం-4037ను విడుదల చేసిన ఐసీఏఆర్
- స్వస్థలం గంగారం తండాలో హర్షాతిరేకాలు
- గతేడాది వరదల్లో తండ్రితో సహా ప్రాణాలు కోల్పోయిన అశ్విని
- అద్భుతమైన ప్రతిభతో ఎదుగుతున్న తరుణంలో కాటేసిన ప్రకృతి

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కారేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆమె.. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) శాస్త్రవేత్తగా రైతులకు సేవలు అందించాలని కలలు కన్నది. పరిశోధనలతో కొత్త వంగడాలకు ప్రాణం పోయాలనుకుంది. ఆ దిశగా అనేక పరిశోధనలు సాగించింది. వాటి ఫలాలను అందుకునే తరుణంలోనే అనూహ్యంగా తండ్రితోపాటు ప్రకృతి వైపరీత్యానికి బలైపోయింది. అయితే ఆమె సాగించిన పరిశోధనలకు గుర్తింపుగా ఐసీఏఆర్ విశిష్టమైన గుర్తింపును ఇచ్చింది. పూసశనగలో మేలు రకం వంగడం కోసం ఆమె చేసిన పరిశోధనలకు మెచ్చి, పూసవంగడం-4037ను అశ్విని పేరుతో విడుదల చేసింది. ఇలా మరణం తర్వాత అశ్వినికి అరుదైన గౌరవం లభించింది. ఆమె పేరు జాతీయస్థాయిలో నిలిచింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని గంగారం తండాకు చెందిన వ్యవసాయ యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని గతేడాది ఆగస్టు చివరి వారంలో తన సోదరుడి నిశ్చితార్థం కోసం స్వగ్రామానికి వచ్చింది. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు తండ్రి ధరావత్ మోతీలాల్‌తో కలిసి కారులో బయలుదేరింది. అయితే అప్పటికే కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు పోటెత్తగా, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం వద్ద ఆకేరు వాగులో గల్లంతై మృతిచెందారు. భారీ వర్షాలు కురుస్తున్నా.. తనకు విధి నిర్వహణే ముఖ్యమని భావించిన అశ్విని... ఎయిర్‌పోర్టుకు వెళ్లే క్రమంలో వరదలకు బలైపోయింది. ఆనాడు ఈ సంఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అశ్విని చనిపోయి ఏడు నెలలు దాటింది. ఈ క్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తగా ఆమె చేసిన పరిశోధనలకు ఐసీఏఆర్ జేజేలు పలికింది. ఆమె పేరు చిరస్థాయిగా నిలిచేలా, ఆమె సృష్టించిన పూసశనగ వంగడానికి 'అశ్విని'గా నామకరణం చేశారు. అశ్విని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ చదివి, ఆ తర్వాత రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ క్యాంపస్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. వ్యవసాయ విద్యలో పలు బంగారు పతకాలు సాధించారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లోని ఐసీఏఆర్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తగా ఉద్యోగం సాధించారు. హెక్టారుకు 26.73 క్వింటాళ్ల నుంచి 36.464 క్వింటాళ్ల దిగుబడిని ఇచ్చే కొత్త శనగ రకానికి అశ్విని పేరు పెట్టడం గర్వించదగిన విషయం. ఈ వంగడం పంజాబ్, హర్యానా, ఢిల్లీ, వెస్ట్‌యూపీ, నార్త్‌రాజస్థాన్, జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో సాగుకు అనుకూలం. ఇది వేరుకుళ్లు,



ఎండుతెగులు తట్టుకుని అధిక దిగుబడులను ఇస్తుంది. అలాగే ప్రోటీన్ 24.8శాతం ఉంది. అశ్విని పేరుతో పూసశనగకు చెందిన వంగడం విడుదల చేయడం పట్ల తల్లి, సోదరుడితోపాటు స్థానికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. తల్లి నునావత్ నేజీ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తమ కుమార్తె మరణం బాధాకరమని, అయితే ఆమె పేరు విత్తనానికి పెట్టడం కొంత సంతోషాన్ని కలిగిస్తున్నదని తెలిపారు. కాగా అశ్విని సోదరుడు అశోక్‌కు కారుణ్య నియామకం కింద ఇటీవలనే పంచాయతీరాజ్ ఏఈ ఉద్యోగం ఇచ్చారు.

కమ్యూనిస్టు పార్టీలదే

భవిష్యత్

- ఓట్లు, సీట్లు కాదు, ప్రజా సమస్యలపై పోరాటాలే లక్ష్యం
- ప్రజల్ని తాత్కాలికంగా మభ్య పెడుతున్న బూర్జువా పార్టీలు
- యర్రా శ్రీకాంత్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- నగరంలో ఘనంగా యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభ



యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బూర్జువా పార్టీలు తాత్కాలికంగా ప్రజల్ని మభ్యపెట్టి ఓట్లు, సీట్లు సాధించి అధికారంలోకి వచ్చినా, అవి ఎక్కువ కాలం అధికారంలో ఉండలేక పోతున్నాయని, తెలంగాణలో బీఆర్ఎస్, టీడీపీలకు అటువంటి పరిస్థితే ఏర్పడిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు కారణంగా ప్రజల దీర్ఘకాలిక సమస్యలు పెరుగుతున్నాయని ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలకు మంచి భవిష్యత్ ఉంటుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. ఖమ్మంలో దివంగత నేత యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభను జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ యర్రా శ్రీకాంత్ లేని లేటు ప్రజా ఉద్యమాలపై పడుతుందన్నారు. కమ్యూనిస్టు నాయకులు పోరాటాలతో పాటుగా వారి ఆరోగ్యం చూసుకోవాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. మధురైలో ఇటీవల జరిగిన పార్టీ 24వ ఆలిండియా మహాసభల్లో దేశంలోని ప్రజలందరికీ ఆహారం, ఇల్లు, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పింఛన్లు పౌర హక్కులుగా చేయాలని తీర్మానించటం జరిగిందన్నారు. అందుకు తగిన విధంగా ఊరు వాడ నుంచి ఉద్యమ కార్యాచరణ చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనలో మహిళలను బస్సులు ఎక్కించటం తప్ప చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బహిరంగంగా మంత్రి (మిగతా 6వ పేజీలో)

ఈ హెచ్‌ఎం మాకొద్దు...



మాట్లాడుతున్న నాగలక్ష్మి

- కోయ విద్యార్థినుల పట్ల వివక్ష చూపుతున్నారు
- అకారణంగా తిడుతూ మనోవేదనకు గురిచేస్తున్నారు
- ఆదివాసీ విద్యార్థిని కొమరం నాగలక్ష్మి ఆరోపణ
- వైరల్‌గా మారిన సెల్ఫీ వీడియో

6

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షం బీభత్సం సృష్టించింది. పగలంతా తీవ్రమైన ఎండ, ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగా అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి గాలిదుమారంతో భారీ వర్షం కురిసింది. రైతులు తేరుకుని ఆరబోసిన ధాన్యం, కల్లాల్లో ఎండబెట్టిన మిర్చి, మొక్కజొన్నలపై పట్టాలు కప్పుకునే సమయం కూడా ఇవ్వకుండా భారీ వర్షం విరుచుకుపడింది.



కూసుమంచిలో అకాల వర్షంతో తడిసిన ధాన్యం

అర్ధరాత్రి అతలాకుతలం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈదురు గాలులతో భారీ వర్షం

- పొలాల్లో నేలవాలిన వరి
- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఖమ్మం/కొత్తగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు నేలకొరగడంతో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల పొలాల్లో వరి పంట నేలకొరిగింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. కొణిజర్ల మండలం పెద్దగోపతి, పెద్ద మునగాల, చిన్న మునగాల,



పెద్దగోపతిలో నేలవాలిన వరి పంట

కాచారం, కొణిజర్ల, కొండవనమాల గ్రామాల్లో చేతి కొచ్చిన వరిపంట నేలమట్టమైంది. కూసుమంచి, జుజ్జులరావుపేట, నాయకన్‌గూడెం, పాలేరు, నర్సింహులగూడెం గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం రాశులపై పట్టాలు కప్పినా గాలిదుమారానికి అవి ఎగిరిపోవడంతో ధాన్యం తడిసిపోయింది. ఖమ్మం రూరల్, ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుర్రాల పాడు, గుదిమల్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి, (మిగతా 6వ పేజీలో)

పంట మొత్తం నేలవాలింది...

ప్రతాపనేని నరసింహరావు, పెద్దగోపతి, కొణిజర్ల మండలం



కొణిజర్ల మండలం పెద్దగోపతిలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అకాల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లింది. నేను పది ఎకరాలలో వరిని సాగు చేశాను. పంట చేతికొచ్చే దశలో అకాలవర్షం దెబ్బకొట్టింది. పంట మొత్తం నేలవాలింది. దీంతో వరి గొలుసుల్లో తాలు తయారై పంట దిగుబడి తగ్గుతుంది. అకాలవర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి.

పూర్తిగా ధ్వంసమైన మునగ తోట



అశ్వారావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలో గత నాలుగు రోజులుగా గాలి దుమారం, భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తుండడంతో పంటలకు నష్టం జరుగుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. గాలిదుమారం తీవ్రతకు మండల పరిధిలోని పాత మామిళ్లవారిగూడెంలో నల్లాని వెంకటేశ్వరరావుకు చెందిన మూడు ఎకరాల మునగ తోట పూర్తిగా ధ్వంసమైంది. మునగతోట వేస్తే లాభాల బాటలో నడవవచ్చని, ప్రభుత్వం రాయితీ ఇస్తుందని అధికారులు అవగాహన కల్పించడంతో రైతు వెంకటేశ్వరరావు 9 నెలల క్రితం మూడెకరాల్లో మునగ సాగు చేశాడు. ఎకరానికి లక్ష చొప్పున రూ.మూడు లక్షలు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం తోట పూత, కాపు మీద ఉంది. మరి కొద్దిరోజుల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టే దశలో ఉంది. ఈ సమయంలోనే ఈదురు గాలులు రావడంతో మునగ తోట కూకటి వేళ్లతో సహా ధ్వంసమైంది. తోట మొత్తంలో ఒక్క చెట్టు కూడా నిలబడలేదు. ఎంతో కష్టపడి పెంచిన మునగ తోట ధ్వంసమైందని, లక్షల్లో నష్టం జరిగిందని రైతు వెంకటేశ్వరరావు విలపిస్తున్నాడు.

కుదేలవుతున్న అన్నదాత

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు వరుసగా వెంటాడుతుండటంతో కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు పూర్తిగా నేలవాలింది. మరో వైపున వరి మడులలో మోకాలు లోతు వరద నీరు చేరింది. దీంతో యంత్రాలతో వరి కోతలకు అంతరాయం కలిగింది. వాతావరణం పొడిగా ఉంటే ఎకరం వరి కోతకు గంట పట్టగా... ఇప్పుడు మూడు గంటలు పడుతోంది. దీంతో ఖర్చు ఎకరాకు రూ.10 వేలు అయింది. దీనికి తోడు కేంద్రాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యం రంగు మారకుండా దంతేలతో దశల వారీగా తిరగదోడాల్సి వస్తోంది. కూలీలకు ఎకరానికి రూ2 వేలు చొప్పున చెల్లించాల్సి వస్తోంది.

కౌలు రైతు ఆత్మహత్య

అప్పుల బాధే కారణం



శ్రీనివాసరావు (ఫైల్)

దమ్మపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పుల ఒత్తిడి తట్టుకోలేక పురుగుల మందు తాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దమ్మపేట మండలం మందలపల్లి గ్రామలో జరిగింది. మందలపల్లి గ్రామానికి చెందిన మడిపల్లి శ్రీనివాసరావు (48) కౌలు వ్యవసాయం కింద చెరుకు సాగు చేస్తున్నాడు. ఇందుకోసం కొందరి వద్ద నుంచి అప్పులు తీసుకున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయంలో నష్టం రావటంతోపాటు అప్పులు తీసుకున్నవారి నుంచి ఒత్తిడి పెరగటంతో మనస్థాపం చెందాడు. బుధవారం ఉదయం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సత్తుపల్లి వైద్యశాలకు తరలించారు. చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య రమాదేవి దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. దమ్మపేట ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

భర్త చిన్న కర్మ రోజే

భార్య మృతి

ఏలువారిగూడెంలో విషాదం



దిండు పద్మ (ఫైల్)

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం మండలం, ఏలువారిగూడెంలో బుధవారం భర్త చిన్నకర్మ రోజునే భార్య గుండె పోటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన దిండు ఉపేందర్ (55) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ ఈ నెల 14న సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటినుంచి భర్త మరణం తలుచుకుంటూ భార్య పద్మ (45) రోదిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం భర్త చిన్నకర్మ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పద్మ తన భర్త చిత్రపటానికి పూలమాల వేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తిరుమలాయపాలెం వైద్య విధానపరిషత్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మూడురోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

తేరుకున్న 'భక్త రామదాసు'

- ప్రాజెక్టుకు పూర్తిస్థాయి మరమ్మతులు
- రెండో మోటారు ట్రయల్‌రన్ విజయవంతం
- 63 వేల ఎకరాలకు 2.65 టీఎంసీల నీరు విడుదల
- తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలకు వరం



భక్తరామదాసు ట్రయల్‌రన్

కూసుమంచి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గ వరప్రదాయిని భక్తరామదాసు ప్రాజెక్టు మరమ్మతుల పనులు పూర్తయ్యాయి. ఈ మేరకు బుధవారం రెండో మోటారు ట్రయల్‌రన్ విజయవంతం అయింది. గత సెప్టెంబరు 1న వచ్చిన వరదల కారణంగా పాలేరు జలాశయం బ్యాక్ వాటర్ పెరగడంతో భక్తరామదాసు ప్రాజెక్టు వరదనీటితో పూర్తిగా నిండిపోయింది. ఒండ్రు చేరడంతో పాటు, అన్ని పరికరాలు కాలిపోయాయి. గతేడాది అక్టోబరు 14న ఒక యూనిట్‌ను పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తిచేశారు. నీరు విడుదల చేశారు. అనంతరం రెండో మోటారుకు మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం ట్రయల్‌రన్ విజయవంతం అయింది. దీంతో ప్రాజెక్టులోని రెండు మోటార్లు సిద్ధం చేసినట్లు ఐబీ డీఈ రమేష్‌రెడ్డి తెలిపారు.

భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల పరిధిలో ఈ ఏడాది 2.65 టీఎంసీల నీటిని చెరువులు నింపేందుకు విడుదల చేసినట్లు డీఈ రమేష్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు చరిత్రలోనే ఇంత పెద్దఎత్తున నీటిని సరఫరా చేయడం రికార్డు అని తెలిపారు. 63 వేల ఎకరాలకు నీరు అందిందని తెలిపారు. ఒక మోటారును 90 రోజులపాటు నడుపగా అందులో 60 రోజులపాటు నిరంతరాయంగా నడిపించి ఆయకట్టుకు నీరందించినట్లు తెలిపారు. వచ్చే సీజన్‌కు రెండు మోటార్లు సిద్ధం చేసినట్లు వివరించారు. ఆయకట్టులో రైతులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేసినట్టు తెలిపారు.

ప్రజల వద్దకు

భూ భారతి

- నేటి నుంచి 30 వరకు అవగాహన సభలు
- సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.. సూచనలను తెలియజేయవచ్చు
- ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ధరణిస్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి ఆర్వోఆర్ చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కలిపించే కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం చేపట్టింది ప్రజల వద్దకే ఈ చట్టం తీసుకెళ్లి గ్రామసభల ద్వారా వారికి ఎదురవుతున్న భూ సమస్యలపై చట్టం ద్వారా పరిష్కారం చేసే మార్గాలపై అవగాహన కలిపించబోతున్నారు. ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో)

దరఖాస్తు చేసుకున్న రైతుల భూములకు

ల్యాండ్ సర్వే

జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ డి.శ్రీనివాసులు



ఫటాఫట్

ప్రశ్న: జిల్లాలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డు విభాగంలో ఎన్నిరోజుల్లో భూసర్వే నిర్వహిస్తున్నారు?

జవాబు: జిల్లాలో ఆయా సర్వే నెంబర్లలో భూముల కొలతలకు సంబంధించి రైతులు లేదా డీటీపీసీ దరఖాస్తుదారులు తమకు సంబంధించిన భూమి సర్వేకోసం రూ.295 చలానా చెల్లించాలి. 45 రోజుల్లో తప్పనిసరిగా సర్వే చేయడం జరుగుతుంది. ఇందులో జాప్యం ఉండదు.

ప్ర: పట్టా భూములకేనా.. పట్టాలేని భూములకు కూడా సర్వే చేస్తారా?

జ: పహణీలో రైతు పేరు మీద రికార్డు ఉంటే పాసుపుస్తకం లేకపోయినా సర్వేచేసి వారికి రికార్డు ఇవ్వడం జరుగుతుంది.

ప్ర: జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులు?

జ: జిల్లాలో సర్వే ద్వారా ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నాం. అలాగే సీతారామ ఎత్తిపోతల కింద కల్లూరు, కారేపల్లి, ఏన్కూరు తదితర మండలాల్లో ఫీల్డ్ కెనాల్స్, మెయిన్ కెనాల్స్ కోసం సర్వే చివరి దశలో ఉంది. ఇప్పటికే కొంతసర్వే వివరాలను కూడా అందించాం. అలాగే ఎర్రుపాలెం - అమరావతి రైల్వేలైన్, పాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించిన రైతులు భూసేకరణ పూర్తి చేయడం జరిగింది.

ప్ర: జిల్లాలో ల్యాండ్ సర్వేకు సిబ్బంది కొరత ఉందా?

జ: ప్రస్తుతం 21 మండలాలకుగాను 19 మండలాల్లో సర్వేయర్లు ఉన్నారు. రెండు మండలాల్లో లేరు. అయినప్పటికీ అన్ని మండలాల్లో భూముల సర్వేకు సంబంధించి ఎక్కడా జాప్యం చేయడంలేదు.

ప్ర: శాఖాపరంగా చేపడుతున్న ఇతర సేవలు?

జ: జిల్లాలో రైతులు కాని ఇతర భూ యజమానులకు సమాచారం కోసం సర్వేల్యాండ్ రికార్డుకు దరఖాస్తు చేస్తే అందుకు సంబంధించిన మ్యాప్‌లు, రికార్డులు అందించడం జరుగుతుంది.

ప్ర: సర్వే ల్యాండ్ రికార్డు డిజిటలైజేషన్ కార్యక్రమం ఎంతవరకు వచ్చింది?

జ: సర్వే ల్యాండ్ రికార్డులో 1923 చట్టం ప్రకారం 1954 నుంచి జిల్లాలో ల్యాండ్ రికార్డు భద్రపరచడం జరిగింది. కొన్ని చిన్నదశలో ఉన్నాయి. 50 శాతం డిజటలైజేషన్ చేశాం.

ప్ర: జిల్లాలో ఎన్ఎస్‌పీ భూములు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వ భూములకు సరిహద్దులు నిర్ధారించారా?

జ: ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి తమ శాఖకు ఎలాంటి పర్యవేక్షణ ఉండదు. ఇరిగేషన్, ఎండోమెంట్, ప్రభుత్వ ఖాళీ భూములకు సంబంధించి తమకు దరఖాస్తు చేస్తే దాని ప్రకారం సర్వేచేసి హద్దులు పెడతాం. మా శాఖ పరంగా సొంతంగా సర్వేలు ఉండవు. ఎన్ఎస్‌పీ అధికారులు మొత్తం ఎన్ఎస్‌పీ భూములకు సరిహద్దులు పెట్టాలని తమకు దరఖాస్తు చేస్తే రికార్డులు పరిశీలించి సరిహద్దులు ఏర్పాటు చేయడం జరుగుతుంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

మణుగూరు మండలంలోని పలు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఆదర్శవంతంగా పనిచేస్తూ పురోగమిస్తున్నాయి. ఈ గ్రూపుల్లోని మహిళలు స్వతంత్రంగా శ్రమించడం ద్వారా లభించే ఆదాయంతో ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవడంతో వారిలో ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. మగవాళ్లతో సమానంగా సంపాదించగలమన్న తృప్తి వారిలో కలగడం మరో శుభపరిణామం.


ఫ్లెక్సీ షాపు నడుపుతున్న లావణ్య

ఆర్థిక పరిపుష్టితో

మహిళల్లో ఆత్మవిశ్వాసం

- మహిళలకు సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు వరం
- పేద కుటుంబాల జీవితాల్లో పురోగతి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీ పరిధి మినహా మిగిలిన గ్రామాల్లో మొత్తం 723 సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులున్నాయి. వీటిలో అధికశాతం విజయవంతం అయ్యాయి. 2023-24 నుంచి 2024-25 మధ్య కాలంలో మహిళలు వివిధ బ్యాంకుల్లో రూ.15కోట్లను పొదుపు చేయగలిగారు. పాడి గేదెలు, కిరాణా షాపులు, బజ్జీల బండ్లు, టైలరింగ్, కోడిగుడ్ల వ్యాపారం, వెల్డింగ్ షాపులు, కోళ్ల పెంపకం, బ్యాండు మేళం, ఆకు కూరల వ్యాపారం చికెన్ షాపులు ఇలా పలు రకాల పనులను ఎస్‌హెచ్‌జీ సహాయంతో మహిళలు విజయం వంతంగా నిర్వహించుకో గలుగుతున్నారు.

కనకదుర్గ గ్రామసంఘంలోని శివసాయి గ్రూపునకు చెందిన లావణ్య ఐదు లక్షల బ్యాంకు లింకేజీతో ఫ్లెక్సీ షాపును నిర్వహిస్తోంది. నెలకు రూ.30వేలు ఆదాయం పొందుతోంది. కావేవి గ్రామ సంఘంలో నేహా గ్రూపునకు చెందిన అనిత రెండు లక్షల బ్యాంకు రుణంతో వస్త్రాల వ్యాపారం చేస్తోంది. నెలకు రూ.20వేలు సంపాదిస్తోంది.

సంపంగి గ్రామ సంఘానికి చెందిన సుప్రజ లక్ష రుణం తీసుకుని పిండి వంటల తయారు చేస్తూ నెలకు రూ.10 వేల ఆదాయం పొందుతోంది. కనకదుర్గ గ్రామ సంఘంలోని సాయిరాం గ్రూపునకు చెందిన కొట్టే స్వాతినేత్ర రూ.2 లక్షల బ్యాంకు రుణంతో వెల్డింగ్ షాపును నిర్వహిస్తోంది. నెలకు రూ.25 వేలు సంపాదిస్తోంది. శ్రీచైతన్య గ్రూపులోని గాజీ అనూష రూ3 లక్షల రుణంతో కోడిగుడ్ల వ్యాపారం చేస్తోంది. నెలకు రూ 10వేల ఆదాయం పొందుతుంది. ప్రతి నెలకు రూ.10 వేల నుంచి రూ.30వేల ఆదాయాన్ని పొందుతున్నారు వీరు. ప్రతి గ్రూపులో ఎనిమిది నుంచి పది మంది సభ్యులు ఉన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలు వివిధ వృత్తుల ద్వారా ప్రతి నెల మంచి ఆదాయాన్ని పొందుతూ తీసుకున్న రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు భర్తల సంపాదనతో అంతంత మాత్రంగా నడిచిన కుటుంబాలు ఎస్‌హెచ్‌జీ రుణాల ద్వారా రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నాయి. భర్తలకు తోడుగా మహిళలు సంసార బాధ్యతలను మోస్తూ ఆర్థి కంగా ఆదుకోగలుగుతున్నారు. ఆడవాళ్ల అందరికీ దీనిని వర్తింపజేయాలని మేము కూడా సంపాదించి కటుంబం బారం మోయడం ఎంతో సంతృప్తిగా ఉంటుందని మహిళలు అంటున్నారు. ఎంపీడీవో తాళ్లూరి శ్రీనివాసరావు ఈ గ్రూపుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ శ్రద్ధ తీసుకుంటూ కృషి చేస్తున్నారు. ఆయన కృషిని మహిళలు ప్రశంసించారు. మండలంలో ఉన్న గ్రూపుల్లో అధికశాతం ఆదర్శవంతంగా నడుస్తున్నాయి. ఎస్‌హెచ్‌జీ రుణాలు ఇప్పించివారిని అభివృద్ధి చేసేందుకు, గ్రూపుల పని విధానం పర్యవేక్షించేందుకు మహిళా స్త్రీ శక్తి ఏపీఎం అహ్మదుల్లా, సీసీలు ఝాన్సీ, లక్ష్మీకాంత, వెంకటలక్ష్మీలు గ్రూపులను సందర్శిస్తూ పలు సూచనలు సలహాలు అందిస్తున్నారు. దీని వల్ల మండలంలో గ్రూపులు అభివృద్ధి పథాన నడుస్తున్నాయి.


వస్త్రాల వ్యాపారం చేస్తున్న అనిత

మన మూలాలు జానపదంలోనే..

బిరుదురాజు రామరాజు శత జయంతి సదస్సులో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మన మూలాలు జానపదంలోనే ఉన్నాయని, సాహిత్య అధ్యయనం పరిశోధకుల వల్ల మానవ జీవితంలోని అనేక జీవనాంశాలు అర్థం చేసుకోవచ్చని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అన్నారు. బుధవారం జానపద సాహిత్య, విజ్ఞాన పరిశోధక బ్రహ్మ ఆచార్య బిరుదురాజు శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం నిర్వహించిన రామరాజు శత జయంతి సమాలోచన సదస్సుకు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జానపద పరిశోధన చేసిన మొట్టమొదటి పరిశోధకుడు బిరుదురాజు, తెలుగు సాహిత్యంలో విభిన్నమైన సాహిత్యకారుడిగా నిలిచారని అన్నారు. విద్యార్థులు ముందు తరాల సాహిత్యాన్ని పఠనం, పరిశోధనల దిశగా ఆలోచన చేయాలని సూచించారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ గన్నమరాజు మనోహర్‌బాబు మాట్లాడుతూ బహుముఖీనమైన సాహితీమూర్తిగా ఆయన అధ్యయనం, చారిత్రక శాసన పరిశోధన మీద సాధికారత ఆయన ప్రత్యేకత అన్నారు. ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ ఖమ్మం కళాశాల విద్యార్థుల కోసం విభిన్న జిజ్ఞాసాత్మకమైన సదస్సులు నిర్వహించటంలో సంస్కారవంతమైన కళాశాలగా నిలిచిందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్, కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యుడు రవిమారుత్ హాజరై మాట్లాడారు. ముందుగా బిరుదురాజు రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్ శాస్త్రీ, బానోత్ రెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ పి రవికుమార్, సునంద, యాకుబ్ , అధ్యాపకులు డాక్టర్ సీతారాం, జె అనురాధ, ఎంవీ రమణ, కిరణ్, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.


బిరుదురాజు రామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బాలాచారి

పాలేరు నియోజకవర్గంలో..

భూభారతి చట్టంపై నేటినుంచి

అవగాహన కార్యక్రమాలు

కూసుమంచి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ వోఆర్ చట్టం భూభారతిపై గురువారం నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో మొదటగా పాలేరు నియోజకవర్గంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఏప్రిల్ 17న ఉదయం తొమ్మిది గంటలకు నేలకొండపల్లి, 19న ఉదయం తిరుమలాయపాలెం మండలంలో, మధ్యాహ్నం 2 గంటలకు కూసుమంచిలో, 21న ఖమ్మంరూరల్ మండలంలో అవగాహన కార్యక్రమా లు నిర్వహించనున్నారు. అవగాహన కార్యక్రమాల్లో పెద్దఎత్తున రైతులను సమీకరించనున్నారు.

నైనీ బొగ్గు గని ప్రాజెక్టుతో

సింగరేణి విశ్వవ్యాప్తం

ఒడిశాలో నైనీ గనిని వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం విక్రమార్క


బొగ్గు ఉత్పత్తి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కొత్తగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిన సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో నైనీ ప్రాజెక్ట్ ద్వారా సింగరేణి విశ్వవ్యాప్తంగా విస్తరణ వైపు పరుగుల పెడుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఒరిస్సాలో నైనీ బొగ్గు గనిని ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గనిని ప్రారంభించుకోవటం ఒక సువర్ణ అధ్యాయమని తెలిపారు. ఒరిస్సాలో గనిని ప్రారంభించటం సింగరేణి సంస్థకే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆనందకరమైన సందర్భమన్నారు. సింగరేణి విస్తరణలో నైనీ బొగ్గు బ్లాక్ తొలిఅడుగుగా ఆయన అభివర్ణించారు. నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖమంత్రి కిషన్‌రెడ్డికి, ఒరిస్సా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి శ్రీధర్మేంద్రప్రధాన్, ఒరిస్సా సీఎం మోహన్‌చరణ్ మాఝీకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సింగరేణి సీఎండీ బలరాంనాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చూపిన ప్రత్యేక చొరవ వల్లే నైనీ బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఓఎస్‌డీ సురేందర్‌రెడ్డి, సింగరేణి ఈడీ (కోల్‌మూమెంట్) ఎస్‌డీఎం సుభాని, నైనీ సంస్థ డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

తల్లంపాడు, కొండాపురం, ఆరెంపుల, మంగళగూడెం, తీర్దాలలో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిచిపోయాయి. కల్లూరు మండలంలోని చెన్నూరు ప్రాంతంలో పొలాల్లో వరిపంట నేలమట్టమైంది. రానున్న రోజుల్లోనూ భారీ వర్షాలు ఉన్నాయన్న సమాచారంతో రైతులు వరిపంటను కోయించేందుకు బుధవారం పరుగులు తీశారు. రెండింతలు ధర పెట్టి మరీ మిషన్లతో వరి కోయిస్తున్నారు.

మధిర-తిరువూరు ప్రధాన రహదారిలో ఆత్కూరు, ఖాజీపురం గ్రామాల మధ్య మర్రిచెట్టు విరిగి పడిపోయింది. దీంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా నిదానపురం గ్రామంలో గాలిదుమారానికి మొక్కజొన్న చేలు నేలవాలాయి. ఖమ్మం మార్కెట్‌లో యార్డులో రైతులకు చెందిన మిర్చి బస్తాలు కొంత మేర తడిశాయి. మార్కెట్ సిబ్బంది సకాలంలో రైతులకు టార్పాలిన్‌లు అందించడంతో ముప్పు తప్పింది. అయితే బుధవారం మార్కెట్‌లో తడిసిన మిర్చి బస్తాలను కొనుగోలు చేసిన కొందరు వ్యాపారులు బస్తాకు రెండు కేజీల తరుగు తీశారు. జిల్లా వ్యాప్తంగా మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. ఖమ్మం జిల్లా వైరాలో అత్యధికంగా 3.4సెం.మీ. వర్షపాతం నమోదుకాగా.. కల్లూరులో 2.8సెం.మీ., కొణిజర్లలో 1.6సెం.మీ., వేంసూరు, కామేపల్లిలో 1.5, సింగరేణి 1.3, రఘునాథపాలెం మండలంలో 1.1సెం.మీ. వర్షపాతం నమోదైంది.


తడిసిన మొక్కజొన్నను ఆరబోస్తున్న బస్వాపురంలోని రైతు


మధిర మండలం ఆత్కూరు - కాజీపురం గ్రామాల మధ్య రోడ్డుపై విరిగిపడిన చెట్టు

భద్రాద్రి జిల్లాలో...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లాలోని జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, పాల్వంచ, కొత్తగూడెం, బూర్గంపాడు, అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, సూజాతనగర్, చుంచుపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, మణుగూరు, అశ్వాపురం తదితర మండలాలలో భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో కల్లాలో ఆరబోసిన మిర్చి తడిసింది. మండలాలలో కోత దశలో ఉన్న వరిపంట నేలరాలింది. మామిడికాయలు నేలరాలాయి. గత కొన్ని రోజులుగా అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురుస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

ఈ హెచ్‌ఎం మాకొద్దు...

- ఆదివాసీ విద్యార్థిని కొమరం నాగలక్ష్మి ఆరోపణ
- వైరల్‌గా మారిన సెల్ఫీ వీడియో

దుమ్ముగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బి.రాములు వివాదంల చిక్కుకున్నారు. కోయ వర్గానికి విద్యార్థినుల పట్ల వివక్ష చూపుతున్నారని, అకారణంగా తిడుతూ, ఆయన సామాజిక వర్గమైన లంబాడా విద్యార్థులకు వత్తాసు పలుకుతున్నారని ఆదివాసీ విద్యార్థిని కొమరం నాగలక్ష్మి ఆరోపించింది. ఆమె మాట్లాడిన సెల్ఫీ వీడియో బుధవారం వైరల్‌గా మారింది. ఎనిమిదో తరగతికి చెందిన సదరు ఆదివాసీ విద్యార్థిని వీడియోలో మాట్లాడుతూ లంబాడా వాళ్లకు, తమకు మధ్య గొడవ జరిగితే హెచ్‌ఎం లంబాడా విద్యార్థులను సపోర్ట్ చేస్తూ మాట్లాడుతున్నారని ఆరోపించింది. తమ ఆశ్రమపాఠశాలలో ఆదివాసీ మహిళా టీచర్లను నియమించాలని, మగ టీచర్లను తొలగించాలని కోరింది. తమకు లంబాడా టీచర్లు వద్దని ఆదివాసీ కోయ టీచర్లు కావాలని రోదిస్తూ కోరింది. వాచ్‌మెన్‌ను విధుల నుంచి తొలగించడానికి తమకు తెలియకుండా సంతకాలు తీసుకున్నారని, కొందరి పేరున దొంగ సంతకాలు కూడా చేశారని, సంతకాలు ఎందుకని అడిగితే హెచ్‌ఎం తమను తిట్టారని తెలిపింది.

రాత్రంతా ఉన్న యువకులు...

ఇదిలావుండగా, పదిహేను రోజుల క్రితం రామచంద్రునిపేట ఆశ్రమపాఠశాల వసతిగృహంలోకి మండలంలోని ఓ గ్రామానికి ఇద్దరు యువకులు చొరబడి రాత్రంతా అక్కడే నిద్రించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెల్లారిన తర్వాత గమనించిన ఆశ్రమపాఠశాల వర్కర్లు ఆ ఇద్దరు యువకులను నిద్ర లేపి బయటకు పంపించారు. సదరు యువకుల్లో ఒకరికి ఆశ్రమ పాఠశాలలోని ఓ విద్యార్థినితో పరిచయం ఉందని తెలుస్తోంది. ఈ విషయమై హెచ్‌ఎం ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని సమాచారం. దీనిపై ఎటువంటి విచారణ జరగకపోగా, స్థానికంగా పంచాయితీ నిర్వహించి జరిమానా వసూలు చేసి వదిలేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై హెచ్‌ఎం బి.రాములును వివరణ కోరగా తనపై కుట్రపూరితంగా కావాలనే కొందరు ఇదంతా చేశారన్నారు. తాను వీడియోను పూర్తిగా చూడలేదని, ఆరోపణలు చేసిన విద్యార్థిని ఊరుకు వెళ్లి విషయాన్ని కనుక్కుంటానన్నారు. యువకులు వసతిగృహంలో రాత్రివేళ చొరబడిన విషయమై మాట్లాడుతూ వాళ్లు చోరీకి వచ్చారన్నారు. ఊరివాళ్లు వారిని పట్టుకొని సమస్యను పరిష్కరించుకున్నారని తెలిపారు.

కాగా, ఆశ్రమపాఠశాలలో జరుగుతున్న వివాదాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రాంచరణ్, ఎం.శివప్రశాంత్, మానవహక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి పూనెం ప్రదీప్‌కుమార్, ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు, కాంగ్రెస్ నాయకుడు తెల్లం నరేష్‌లు డిమాండ్ చేశారు. హెచ్‌ఎం పర్యవేక్షణాలోపం, నిర్లక్ష్యంపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

ప్రజల వద్దకు భూ భారతి

(5వ పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు గురువారం నుంచి ఈనెల 30 వరకు అన్ని మండల కేంద్రాల్లో భూభారతి చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పి.శ్రీజ బుధవారం విడుదల చేశారు. మండలస్థాయిలో అధికారులకు భూభారతి చట్టంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు అవగాహన సభల్లో భాగంగా మండల కేంద్రాలు, గ్రామపంచాయతీ ఆఫీసులు, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్‌తోపాటు ప్రధాన కూడళ్లలో పోస్టర్లు, కరపత్రాలను కూడా ప్రదర్శించనున్నారు.



17న ఉదయం 9గంటలకు నేలకొండపల్లి, 19న ఉదయం 9గంటలకు తిరుమలాయపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు కూసుమంచి మండలం, 21న ఉదయం 9 గంటలకు ఖమ్మం రూరల్‌లో, మధ్యాహ్నం 2గంటలకు ఖమ్మంఅర్బన్ మండలంలో సభలు నిర్వహిస్తారు. 22న ఉదయం 9గంటలకు రఘునాథపాలెం మండలంలో.. మధ్యాహ్నం 2 గంటలకు ముదిగొండ మండలం, 23 ఉదయం 9 గంటలకు మధిర మండలం మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రుపాలెం, 24న ఉదయం 9గంటలకు చితకాని మండలం, మధ్యాహ్నం 2గంటలకు బోనకల్‌లో సభలు నిర్వహిస్తారు.

25న ఉదయం 9గంటలకు వైరా మండలం, మధ్యాహ్నం 2 గంటలకు ఏన్కూరు మండలం, 26న ఉదయం 9గంటలకు కొణిజర్ల , మధ్యాహ్నం 2గంటలకు సింగరేణిలో మండలంలో సభలు నిర్వహిస్తారు.

28న ఉదయం 9 గంటలకు సత్తుపల్లి మండలం, మధ్యాహ్నం 2 గంటలకు వేంసూరు, 29న ఉదయం 9గంటలకు కల్లూరు మండలం, మధ్యాహ్నం 2గంటలకు పెనుబల్లి మండలం, 30న ఉదయం 9 గంటలకు తల్లాడ మండలంలో సదస్సులు జరుగుతాయి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఇల్లెందు నియోజకర్గంలోని కామేపల్లి మండలంలో సభలు నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి...

భూభారతిపై నిర్వహించే అవగాహన సభలను ప్రజలు, రైతులు సద్వినియోగించుకోవాలని ఆయా మండల కేంద్రాల్లో జరిగే సదస్సులకు ప్రతీ ఒక్కరు హాజరుకావాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ కోరారు. భూభారతి కొత్త చట్టంపై గురువారం నుంచి 30వతేది వరకు జరిగే అవగాహన సదస్సులు ఉదయం 9గంటల నుంచి 12గంటలకు ఒక మండలంలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మరో మండలంలో జరుగుతాయని తెలిపారు. రైతులు భూయజమానులు , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సులకు వచ్చి భూభారతి చట్టం నిబంధనలు తెలుసుకోవాలని, ఏమైనా సందేహాలుంటే చెప్పవచ్చన్నారు.

25 వరకు అగ్ని వీర్ ఎంపికల

పరీక్ష గడువు పొడిగింపు

భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్

చుంచుపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీ వరకు అగ్నివీర్ ఎంపిక పరీక్ష గడువు పొడిగించినట్లు భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తిగల నిరుద్యోగ యువకులు తెలంగాణలోని సికింద్రాబాద్ ఏఆర్‌వో వారు నిర్వహించే అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2025-2026 నియామక సంవత్సరానికి గాను ఈ ఎంపికల గడువు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ www.joinindiaarmy.nic.in సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆలయ బహిష్కరణపై ఖండన

దుమ్ముగూడెం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాదు జిల్లాలో రామాలయం నుంచి గౌడ మహిళల బహిష్కరణను ఖండిస్తున్నట్లు బీఎస్పీ మండల ఇన్‌చార్జ్ కొప్పుల నారాయణ బుధవారం తెలిపారు.

కమ్యూనిస్టు పార్టీలదే భవిష్యత్

(5వ పేజీ తరువాయి)

పదవుల కోసం పత్రికలకు ఎక్కే పరిస్థితి రావటంతో ముఖ్యమంత్రి జోక్యం చేసుకొనే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పాడిందన్నారు. ప్రజలకు ఏదైనా కష్టాలు వస్తే కమ్యూనిస్టుల వైపు చూస్తారని తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ అఖిల భారత సభలో యర్రా శ్రీకాంత్‌తో గడిపిన క్షణాలను గుర్తు చేశారు. వేలాది మంది కార్యకర్తలు పార్టీకి అవసరమైన సమయంలో ముఖ్య నాయకులు మరణించటం తీరని లోటుగా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మరో 25ఏళ్ల పాటు యర్రా శ్రీకాంత్ సీపీఎం కోసం పనిచేయాల్సి ఉండగా ఇటువంటి రోజు రావటం పార్టీకి తీరని లోటుగా ఆవేదన వ్యక్తం చేశారు.

డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ మాట్లాడుతూ యర్రా శ్రీకాంత్ ఎప్పటికప్పుడు ప్రజా ఉద్యమాలను వినూత్నంగా చేస్తూ పార్టీలకు అతీతంగా ప్రజల్ని అకట్టుకున్నారని, అటువంటి నాయకులు ఆకస్మికమరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు బలహీన పడటం సమాజానికి మంచిది కాదన్నారు.

ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటిని వెంటనే పరిష్కారం కోసం యర్రా శ్రీకాంత్ రాత్రింబవళ్లు కృషి చేశారన్నారు. ఈ సంస్మరణ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్. బాబురావు, పోతినేని సుదర్శన్‌రావు, బండారు రవికుమార్, మచ్చావెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, పొన్నం వెంకటేశ్వర్లు, ఎం. సుబ్బారావు, మాచర్ల భారతి, బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, బండి పద్మ, యర్రా శ్రీకాంత్ కుటుంబ సభ్యులు సుకన్య, రమేశ్, గోపి, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

రహదారి భద్రత..
అధికారులందరి బాధ్యత

- ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలి..
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- రహదారి భద్రతపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం

కొత్తగూడెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రక్తసికమవుతున్న రహదారులపై అధికారులందరూ దృష్టిసారించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రధానంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశమందిరంలో రోడ్డు భద్రతపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రహదారులు.. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో రాష్ట్ర రహదారితో పాటు ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, అర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈవో వెంకటేశ్వర చారి, డీపీవో చంద్రమౌళి, డీసీహెచ్‌వో రవిబాబు, పాల్వంచ, కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- ఏడాదికి 31లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్



వేలంపాట నిర్వహిస్తున్న చీఫ్ కన్జర్వేటర్

ఏన్కూరు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్(వరంగల్ జోన్) భీమానాయక్ అన్నారు. బుధవారం ఏన్కూరు వెదురుడిపోలో బహిరంగ వేలంపాట సందర్భంగా హాజరై వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 63వేల హెక్టార్లలో అడువుల విస్తరించి ఉన్నాయన్నారు. అడువుల సంరక్షణకు సీసీకెమేరాలు, రాత్రిపూట గస్తీబృందాలు ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. అడువుల శాతాన్ని పెంచేందుకు గతకొన్నేళ్ల నుండి ఎద్దఎత్తున మొక్కలు పెంచుతున్నట్టు తెలిపారు. ఈఏడాది 31లక్షల మొక్కలు నాటేదుకు లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు.

అందని పౌష్టికాహారం



- అంగన్‌వాడీ కేంద్రాల్లో నిండుకున్న సరుకులు
- నెల రోజులుగా కోడిగుడ్లు, పాలు, కందిపప్పు, చిరుతిండి బంద్
- ఇబ్బందుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు
- అప్పులు చేసి మరీ ఆహారం అందిస్తున్న కొందరు టీచర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ రోజు రోజుకు దిగజారుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పౌష్టికాహారం నెల రోజులుగా అందడంలేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. గతంలో రిజిస్టర్‌లో నమోదు పద్ధతితో కొంత ఆలస్యంగా వివరాలు ఉన్నతాధికారులకు తెలిసేవి. కాని ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ లో నే లబ్ధిదారులు, పౌష్టికాహర వివరాలు నమోదు చేస్తుండటం వల్ల అనుక్షణం ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుంది. అయినా లబ్ధిదారులకు తిప్పలుతప్పడంలేదు. నెలలుగా పౌష్టికాహార సరుకులు లేకపోయినా అధికారులు స్పందించడం లేదు. దీంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

పౌష్టికాహారం సరఫరాలో నిర్లక్ష్యం..

ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్న సమయంలోనే కేంద్రాల్లో సరిగా పౌష్టికాహారం అందించలేదని, ప్రస్తుతం ఒంటిపూట ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తుండగా ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని ఏడు ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గత నెల రోజులుగా నిత్యావసర వస్తువులైన పాలు, పప్పు, కురుకురేలు, కోడిగుడ్లు నిండుకున్నాయి. వీటిని సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులకు అంగన్‌వాడీ టీచర్లు ఇవ్వలేకపోతున్నారు. కేంద్రాలకు అందించే సామగ్రిలో నిత్యం ఏదో ఒకటి అందుబాటులో ఉండడంలేదు. జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 7నెలల నుంచి 3సంవత్సరంలోపు 35,733 మంది, 3 నుంచి 6 సంవత్సరాలోపు 30,328 మంది చిన్నారులు ఉన్నారు. వీరితో పాటు గర్భిణులు, 6,562, బాలింతలు 5,918 మందికి పౌష్టికాహారం అందించాల్సిఉంది. వీరందరికీ పౌష్టికాహారంతో పాటు రోజూవారి కోడిగుడ్లు అందించాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉంటుంది. ఆకుకూరలతో పాటు గర్భిణులు, బాలింతలకు 200మి.లీ. పాలు అందించాల్సి ఉంటుంది. చిన్నారులకు ఎంతో ఇష్టమైన కురుకురేలను అందుబాటులో ఉంచడం లేదు. సంవత్సరంలో కేవలం ఆరు నెలలు మాత్రమే కురుకురేలు అందిస్తున్నారు.

ఇబ్బందుల్లో అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసరాలైన పాలు, కందిపప్పు, కోడిగుడ్లు, కురుకురేలు సకాలంలో లబ్ధిదారులకు అందకపోవటంతో లబ్ధిదారులతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించడంలేదు. కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో పాత నిల్వలు ఉండటంతో కొందరికి పాలు, కందిపప్పు, అందిస్తున్నారు. నిత్యావసర వస్తువులు సరఫరాను పూర్తిగా బంద్ చేయడంతో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం అందించడంలో కొంతమంది కార్యకర్తలు లబ్ధిదారులకు వారి సొంత ఖర్చులతో పౌష్టికాహారం అందిస్తున్నారు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు వస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్తలు వారి కుటుంబాల పోషణతోపాటు కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులను కూడా అప్పులుచేసి ఆహారం అందించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విషయమై ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు నివేదించినా వారు డైరెక్టరేట్ నుంచి రావాల్సిందే తప్ప తాము చేయాల్సింది ఏం లేదని సమాధానం చెబుతున్నారు. పౌష్టికాహారం అందించక పోవడంతో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు రోజురోజుకు తగ్గిపోతున్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటం, అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం సరిగా అందించక పోవడంతో లబ్ధిదారులు కేంద్రాలకు వచ్చేందుకు విముఖత చూపుతున్నారు.

వారం రోజుల్లో అన్ని సమకూరుతాయి

రాంగోపాల్‌రెడ్డి,
జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సిన పౌష్టికాహార సరుకులు మరో వారం రోజుల్లో మొత్తం అందుబాటులోకి వస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా కోడిగుడ్ల కాంట్రాక్ట్ వ్యవస్థలో మార్పులు తీసుకోచ్చేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతో గత నెల రోజులుగా కోడిగుడ్లు అరకొరగా సరఫర జరిగింది. ప్రస్తుతం గతంలో కాంట్రాక్టర్‌కే నెల రోజులు కోడిగుడ్లు సరఫరాను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని పలు ప్రాజెక్టులలో సరపరా కొనసాగుతుంది. కురుకురేలు, పప్పు, పాలు కొన్ని ప్రాజెక్టులలో తక్కువగా ఉన్నట్లు తెలిసింది. వారికి రెండు రోజులలో ఏర్పాటు చేస్తాం.



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

క్రమశిక్షణతో కూడిన బోధనతోనే
ఉన్నత ఉద్యోగాలు

- రూ.6.80లక్షల వేతనంతో యూఎస్ కంపెనీలో ఉద్యోగం

సత్తుపల్లి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో క్రమశిక్షణతో కూడిన తరగతి బోధనతో ఉన్నత ఉద్యోగాలు సాధ్యమవుతాయని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరులోని కళాశాలలో బీటెక్ సీఎస్సీ ఫైనలియర్ విద్యార్థిని మోరంపూడి పూజా సుబమణిని అభినందించారు. యూఎస్ కంపనీ పోర్ట్‌ల్యాండ్ ఐటీ సొల్యూషన్స్‌లో జావా డెవలపర్‌గా ఎంపికవ్వడంతో పాటు వార్షిక వేతనంగా రూ.6.80లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్లేస్‌మెంట్ సాధించేందుకు ప్రిన్సిపాల్ చొరవతో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌ను నేర్పించడం ద్వారా ఇలాంటి విజయాలు తమ విద్యార్థులు సాధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థిని సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, అకడమిక్ డైరెక్టర్ ఏవీ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ జాకీర్‌హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ ఎంవీ రామచంద్రరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీ.రాఘవరాజు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

అడవులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- జిల్లా అటవీ అధికారి కృష్ణగౌడ్

గుండాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం పేరుతో అడవులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అడవుల సంరక్షణలో భాగంగా కొత్తపోడు నరకకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని డీఎఫ్‌వో కృష్ణగౌడ్ అన్నారు. మండలంలోని గలబ, గణాపురం, పాలగూడెం ప్లాంటేషన్లను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అడవులు ఆక్రమణకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని సూచించారు. ప్లాంటేషన్ చుట్టూ ట్రెంచ్‌లు ఉండాలన్నారు. అడవుల్లో జంతువులకు ఏర్పాటు చేసిన తొట్లలో నీళ్ల ఎప్పటికీ ఉండేలా చూడాలన్నారు. వేటగాళ్ల ఉచ్చులకు జంతువులు బలికాకుండా నిఘా పటిష్టం చేయాలని, వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఇల్లెందు ఎఫ్‌డీవో కోటేశ్వరరావు, గుండాల రేంజర్ నర్సింహరావు, డీఆర్‌వో బాలాజీ, సిబ్బంది ఉన్నారు.



ప్లాంటేషన్ పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణగౌడ్

ప్రతిభావంతులకు సూపర్‌స్టార్ నజరానా

- సూపర్‌స్టార్ కృష్ణ స్కాలర్‌షిప్‌కు సత్తుపల్లి విద్యార్థుల ఎంపిక

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మహేష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు అందజేసే సూపర్‌స్టార్ కృష్ణ స్కాలర్‌షిప్‌కు సత్తుపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు రూ.30వేల విలువైన స్కాలర్‌షిప్ పత్రాలను సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘం బుధవారం అందజేసింది. మండలంలోని కాకర్లపల్లికి చెందిన చల్లారి ప్రదీప్‌కుమార్, శరణ్య సత్తుపల్లి పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్నారు. కాగా విజయవాడలోని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ బాధ్యురాలు నమ్రత చేతులమీదుగా స్కాలర్‌షిప్ పత్రాలను విద్యార్థులు అందుకున్నారు.



స్కాలర్‌షిప్ అందుకుంటున్న శరణ్య, ప్రదీప్‌కుమార్

రెండు లారీలు ఢీ: డ్రైవర్ దుర్మరణం

- మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- గట్టుగూడెం వద్ద ఘటన
- మృతుడిది జార్కండ్ రాష్ట్రం

దమ్మపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట-ఖమ్మం ప్రధాన రహదారి దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనటంతో రెండు లారీల క్యాబిన్ మధ్యలో ఇరుక్కుపోయి చనిపోయాడు. మరో డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో సత్తుపల్లి వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న దమ్మపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెండు జేసీబీల సహాయంతో ఇరుక్కుపోయిన లారీలను తొలిగించారు. లారీలో ఇరుక్కుపోయిన మరో లారీ డ్రైవర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్‌లో సత్తుపల్లి వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన లారీ డ్రైవర్ జార్కండ్ రాష్ట్రానికి చెందిన యమున కుమార్ (33)గా గుర్తించారు. రహదారి ఇరువైపులా దాదాపు 5కిలో మీటర్లమేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు దాదాపు రెండుగంటల పాటు శ్రమించి లారీలను తొలిగించారు. ట్రాఫిక్ క్లియర్ చేశారు. డ్రైవర్ మృతదేహాన్ని అశ్వారావుపేట వైద్యశాలకు తరలించారు.



ఎదురెదురుగా ఢీకొన్న లారీలు



యమున కుమార్ మృతదేహం



ఘటనా ప్రదేశంలో వేలాడుతున్న మృతదేహం

గిగ్ కార్మికులకు, ప్లాట్‌ఫారం కార్మికులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): గిగ్‌కార్మికులు, ప్లాటఫారం కార్మికులకు సామాజిక భద్రత ప్రయోజనాలు విస్తరించేందుకు ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదుచేసి ఆయుష్మానభారత్ కార్డులు అందించనున్నట్టు కార్మికశాఖ ఖమ్మం ఉప కమినర్ విజయభాస్కరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలో బుధవారం నుంచి 20వతేది వరకు ప్రత్యేకశిబిరాలు నిర్వహించి ఈశ్రమ్‌పోర్టల్ ద్వారా కార్మికలు నమోదు చేసుకోవడానికి అదుబాటులోకి రానున్నట్టు తెలిపారు. అందుకుగాను అంతర్జాతీయ కార్మికదినోత్సవం మేడే రోజున గిగ్‌వర్కర్లకు భద్రత కలిపించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గిగ్‌కార్మికుల భద్రతకు ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షలు బీమా అమలుకానుందని తెలిపారు. నేటినుంచి నిర్వహించే శిబిరాల్లో అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మంలీగల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ ప్రాంతానికి చెందిన నిందితుడైన మల్లెల నరసింహారావుకు చెల్లని చెక్కు కేసులో ఏడాది శిక్షతోపాటు ఫిర్యాదికి ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పుచెప్పారు. ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాది ఏటుకూరి లక్ష్మణరావు వద్ద నిందితుడు తన వ్యాపార అవసరాల నిమిత్తం పలుదఫాలుగా మొత్తం రూ.21లక్షల తీసుకున్నాడు. ప్రాంసరీనోటు వ్రాయించి ఇచ్చినాడు. ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా నిందితుడు పార్ట్ పేమెంట్ క్రింద 2021లో ఐదులక్షల రూపాయలకు చెక్కు జారీచేసినాడు.ఫిర్యాది బ్యాంక్ ఖాతాలో జమచేయగా బ్యాంక్ వారు రిఫర్ టూ డ్రాయర్‌అని ఫిర్యాదికి బ్యాంకువారు మెమోతో పాటు చెక్కును ఇచ్చినారు. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటుకేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించిన సీపీ

ఖమ్మంక్రైం,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఎండీ షౌకత్‌అలీ కుటుంబ సభ్యులకు భద్రత ఎక్స్‌గ్రేషియా నుంచి మంజూరైన రూ.8లక్షల చెక్కును సీపీ సునిల్‌దత్ అందించారు. బుధవారం ఖమ్మం సీపీ కార్యాలయంలో అందించారు. శాఖపరంగా సహకారాలు అందించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏవో చంద్రకళ, పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న సీపీ

లారీ,బస్సు ఢీ: తప్పిన ప్రమాదం

అశ్వాపురం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అశ్వాపురం ప్రధాన సెంటర్‌లో బుధవారం లారీ, పల్లెవెలుగు బస్సు ఢీకొన్నాయి. కాగా ఎటువంటి నష్టం జరగలేదు. కొత్తగూడెం నుంచి మణుగూరు వెళ్తున్న లారీ,మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న పల్లెవెలుగు బస్సు ఢీకొన్నాయి. బస్సు చివర భాగంలో ఢీకొనటంతో ప్రయాణికులకు ఎటువంటిగాయాలు లేకుండా బయటపడ్డారు. ఈ ఘటనతో గంటసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



లారీ,బస్సు ఢీకొన్న దృశ్యం

నడిరోడ్డుపై గుండెపోటుతో మహిళ మృతి

అశ్వారావుపేటలో నడుచుకుంటూ వెళుతుండగా ఘటన

అశ్వారావుపేట, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వచ్చిన ఓమహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ కళ్లు తిరిగి పడిపోయి మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం అశ్వారావుపేటలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ఎస్‌కే జరీనాబేగం (65) పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన టైర్ల దుకాణం నడిపే షకీల్ ఇంటికి వచ్చారు. బుధవారం షకీల్ వాళ్ల కుటుంబసభ్యులుతో కలసి సంతకు నడుచుకుంటూ వెళుతున్నారు. అకస్మాత్తుగా ఆమె కళ్లు తిరిగి పడిపోయి, అపస్మారక స్థితికి వెళ్లింది. అంబులెన్స్‌లో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు చెపుతున్నారు.



జరీనాబేగం మృతదేహం

క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా ఏర్పాటు చేయాలి

- విధి నిర్వహణలో అలసత్వం సహించం..
- నేర సమీక్ష సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశమందిరంలో నెలవారీ నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. తొలుత జిల్లాలో పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, నిందితుల అరెస్ట్, కేసుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలపై ముందస్తు సమాచారం అధికారులు సేకరించాలని, సోషల్ మీడియాలో ప్రచారమయ్యే కథనాలపై దృష్టి సారించాలని, వదంతులను వ్యాప్తి చేసే వ్యక్తులపై నిఘా పెట్టి, సమగ్ర విచారణ చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందకి ప్రశాంశపత్రాలు అందజేశారు. అన్లైన్ గేమ్‌లు, నిషేదిత గంజాయి అక్రమ రవాణా, ఇతర సాంఘీక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితలకు న్యాయం చేకూర్చేవిధంగా సమగ్ర విచారణ చేసి నేరస్తులకు శిక్ష పడేలా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ చట్టలపై అవగాహన కల్పించాలన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో దొంగతనాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలకు సైబర్‌క్రైం బారిన పడకుండా నిత్యం అవగాహన కల్పించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అలసత్వం తగదని, రోడ్డుప్రమాదాలకు కారణమయ్యే, మద్యం సేవించిన వాహనచోదకులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈసమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు చంద్రభాను, రెహమాన్, సతీష్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జితేందర్, సీఐలు, ఎసైలు పాల్గొన్నారు.

చిరునోములలో ముందస్తు బడిబాట

బోనకల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):వేసవి సెలవులు ఇవ్వక ముందే ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట పట్టారు.బోనకల్ మండలం చిరునోముల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు చింతల రవికుమార్, కొనకంచి రామ్మోహన్ గ్రామస్థులతో కలిసి బుధవారం సాయంత్రం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలల సిబ్బంది, విద్యార్థుల కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు ప్రైవేటుకు పోటీగా గ్రామంలో విద్యార్థులతల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న కార్యక్రమాలతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తామని హామీ ఇస్తున్నారు.



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జీఎస్టీ కార్యాలయం ఎదుట
కాంగ్రెస్ శ్రేణుల నిరసన



ఖమ్మం సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన

ఖమ్మంమార్కెట్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి); ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడంపై బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని రాజకీయ ప్రతీకారానికి దిగుతుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో కక్ష కట్టడం సరికాదన్నారు. సోనియా, రాహుల్‌పై చార్జిషీటును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ పునకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



మామిడి ఫలసాయానికి వేలం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి మహిళా ప్రాంగణంలోని మామిడి చెట్లకు వేలం నిర్వహిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24 వ తేదిన ఉదయం ప్రాంగణంలో జరిగే వేలంలో దరఖాస్తుదారులు పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి గల వారు పేర్లు, వివరాలను మహిళా ప్రాంగణంలో నమోదు చేయించుకోవాల్సింది గా తెలిపారు. మరిన్ని వివరాలకు 7660022512 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

అకాలం వర్షం.. అన్నదాత ఆగమాగం



గుర్రాలపాడులో ధాన్యాన్ని ఆరపోస్తున్న రైతులు



కూసుమంచిలో తడిసిన ధాన్యం బస్తాలు



జుజ్జులరావుపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో

- తడిసిన ధాన్యం, మొక్కజొన్న
- కూసుమంచి, రూరల్ మండలంలో భారీ నష్టం
- ఖమ్మం ఏఎంసీలో స్వల్పంగా తడిచిన మిర్చి బస్తాలు

కూసుమంచి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం అర్ధరాత్రి భారీ గాలిదుమారంతో అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో, గ్రామాల్లో ధాన్యపు రాశులు తడిశాయి. కూసుమంచి, జుజ్జులరావుపేట, నాయకన్‌గూడెం, పాలేరు, నర్సింహులగూడెం గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. రాశులపై పట్టాలు కప్పినప్పటికీ గాలిదుమారానికి పట్టాలు లేచిపోయి తడిసిపోయి నష్టపోయారు. పలు గ్రామాల్లో చెట్లు విరిగిపోయాయి, విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. మామిడికాయలు నేలరాలాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు..

ఖమ్మంరూరల్: అకాలవర్షం అన్నదాతలను ఆగం చేసింది. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం, మొక్కజొన్నలు అకాల వర్షానికి తడిశాయి. దీంతో నోటికాడికి వచ్చిన పంటలు అకాలవర్షాలకు తడవడంతో అన్నదాతలు తీవ్రఆవేదనకు గురవుతున్నారు. ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు, గుదిమల్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి, తల్లంపాడు, కొండాపురం,ఆరెంపుల, మంగళగూడెం, తీర్థాల తదితర గ్రామాల్లో ధాన్యం, మొక్కజొన్న పంటలను అమ్ముకునేందుకు కళ్ళాల్లో, కొనుగోలు కేంద్రాల్లో పంటను ఆరబోశారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా పంటలు పూర్తిగా తడిసి పోయాయి. మామిడి తోటల్లో చెట్లకు ఉన్న మామిడి కాయలు ఈదురుగాలులకు రాలిపోయాయి. తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.





గోల్‌తండాలో తడిసిన మిర్చి, తిరుమలాయాపలెంలో పడిన వరి



మార్కెట్‌లో తడిసిన మిర్చి బస్తాలు

అకాలవర్షంతో తీవ్రనష్టం

తిరుమలాయపాలెం: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాలవర్షంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ముఖ్యంగా మొక్కజొన్న, వరి, మిర్చిపంటకు దెబ్బతిన్నాయి. మండలంలోని బచ్చోడు, బీరోలు, కాకరవాయి, తిరుమలాయపాలెం, వెదుళ్లచెరువు, కొక్కిరేణి, ఎర్రగడ్డ, తదితర గ్రామాల్లోని పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్ల ఆరబోసిన పంటలు తడిసిపోయాయి. వరి నేలకొరిగింది.

మార్కెట్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన భారీ నష్టం



ఖమ్మంమార్కెట్: అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పంటఅమ్మకానికి తీసుకొచ్చిన అన్నదాతల గుండెలు గుబేల్ మన్నాయి. రాత్రిఒంటి గంట సమయంలో అకస్మాత్తుగా బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మిర్చి బస్తాలు కొంత మేర తడిశాయి. ఈ క్రమంలో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి టార్పాలిన్ పట్టాల కోసం మార్కెట్ కార్యాలయం వైపు పరుగులు తీశారు. పట్టాలతో పంటను కాపాడుకోవడంతో వారు భారీ నష్టం నుంచి తప్పించుకోగలిగారు.మార్కెట్ సిబ్బంది సకాలంలో రైతులకు టార్పాలిన్‌లు అందించడంతో పెను ముప్పు తప్పింది. కాగా బుధవారం తడిసిన బస్తాలను కొనుగోలు చేసిన కొందరు వ్యాపారులు బస్తాకు రెండు కేజీల తరుగు తీసి కొనుగోలు చేశారు. నిత్యం బస్తా బరువు క్రింద సాధారణంగా ఒక కేజీ తరుగు మాత్రమే తీసేవారు. దీంతో ఎలాగైతేం తమ పంట అమ్ముడైందన్న ఆనందంతో రైతులు తరుగుకు సై అన్నారు.

30 వరకు భూ భారతి సదస్సులు

- నేలకొండపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమం
- తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలు

నేలకొండపల్లి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): భూభారతి కొత్తఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి 30వ తేదీ వరకు నేలకొండపల్లి మండలవ్యాప్తంగా అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 9గంటలకు నేలకొండపల్లి వాసవీభవన్‌లో మండలస్థాయి అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, ఆర్డీఓలు పాల్గొంటారని చెప్పారు. భూభారతి చట్టం-2025పై రైతులకు పూర్తి అవగాహన కల్పించటానికే సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు తమకున్న భూసమస్యలపై సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులో మొత్తం 13 కాలమ్స్‌ను ఏర్పాటు చేశారు. మిస్సింగ్ సర్వే నెంబర్లు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సర్వే నెంబర్లలో పడిన తప్పులు సరి చేసుకోవటం, తప్పుగా నమోదైన పట్టా భూమల మార్పు, సాదాబైనామాలు, పాసు పుస్తకాలు రాకపోవటం, ధరణిలో నమోదు కాపోవటం సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాసవీభవన్‌లో ఏర్పాట్లను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మర్రి యర్రయ్య, కొణిజర్ల తహసీల్దార్ హుస్సేన్, ఎమ్మార్వైలతో కలిసి పరిశీలించారు. ఎండల నేపథ్యంలో అవగాహనా సదస్సుల వద్ద మెడికల్ టీంలను ఉంచుతున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

ఏ ఊరిలో ఎప్పుడు

17న నాచేపల్లి, చందాపురం.9గంటల నుంచి 5గంటల వరకు, రైతువేదికలో సమావేశం నిర్వహించనున్నారు. 18న చెర్వుమాధారంలో 9గంటల నుంచి 5గంటల వరకు రైతువేదికలో.., 19న మంగాపురం తండాలో 9గంటల నుంచి 5గంటల వరకు, గ్రామ పంచాయతీ కార్యాలయంలో, 20న రావిగూడెంలో, 21న అప్పలనర్సింహాపురంలో 9గంటల నుంచి 1గంట వరకు సమావేశం ఉంటుంది. రాజారాంపేటలో 2గంటల నుంచి 5గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో, 22న అజయ్‌తండాలో 9గంటల నుంచి 11గంటల వరకు ప్రాథమిక పాఠశాల సమావేశం ఉంటుంది. భైరవునిపల్లి, 11.30ల నుంచి 5గంటల వరకుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఉంటుంది. 23న బుద్దారంలో హెల్త్‌సబ్‌సెంటర్, 24న కట్టుకాసారంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో, 25న కొంగరలోని రైతువేదికలో సమావేశం నిర్వహించనున్నారు. 26న పైనంపల్లిలో జడ్పీ హైస్కూల్, 27న రామచంద్రాపురంలో గాంధీ సెంటర్, 28న అనాసాగరంలో ప్రాథమిక పాఠశాలలో, 29న ఆరెగూడెంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించనున్నారు. 30న కోనాయగూడెంలో 9గంటల నుంచి 1గంట వరకు, ఆచార్లగూడెంలో 2గంటల నుంచి 5గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈసదస్సులకు నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎమ్మార్వై మధుసూదన్‌రావుతో పాటుగా మరో ఐదుగురు సభ్యులున్న టీం పర్యవేక్షించనున్నారు.

రెండో టీం సదస్సులు

18నకొత్తకొత్తూరులో 9గంటలనుంచి 1గంట వరకు క్రీడాప్రాంగణంలో, సదాశివపురం 2గంటల నుంచి 5గంటల వరకు ప్రాథమికపాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. 19న నేలకొండపల్లిలో ఉదయం



వాసవీభవన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రైతువేదికలో, 20న బోదులబండలో రచ్చబండ వద్ద, 21న కోరట్లగూడెంలోని యూపీఎస్, 22న చెన్నారంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో, 23న గువ్వలగూడెం యూపీఎస్ పాఠశాలలో సమావేశం నిర్వహించనున్నారు. 24న సుర్దేపల్లిలోని రైతువేదికలో, 25న తిరుమలాపురం తండాలో 9గంటల నుంచి 1గంటవరకు, అమ్మగూడెం 2గంటల నుంచి 5గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. 26నమూటాపురం 9గంటల నుంచి 1గంట వరకు, శంకరగిరి తండా 2గంటల నుంచి 5గంటలవరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో, 27న రాజేశ్వరపురం రైతువేదికలో, 28న మండ్రాజుపల్లి రైతువేదికలో, 29న ముజ్జుగూడెం రైతువేదికలో సమావేశం నిర్వహించనున్నారు. 30న సింగారెడ్డిపాలెం రైతువేదికలో అవగాహనా సదస్సులను నిర్వహిస్తారు. రెండో టీంకు కొణిజర్ల తహసీల్దార్ అప్జల్ హుస్సేన్, ఎమ్మార్వై రవిలతో పాటుగా మరో ఐదుగురు అధికారులు పర్యవేక్షిస్తారు. భూభారతిపై నిర్వహిస్తున్న అవగాహనా సదస్సులను సద్వినియోగం చేసుకుని రైతులు సమస్యలను పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలని నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు.

'ఇండోర్ స్టేడియం' ఖేల్‌ఖతం!

- పెవిలియన్ గ్రౌండ్‌లో నిర్వహణలేని దుస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డా
- పట్టించుకోని జిల్లా క్రీడల, మునిసిపల్ శాఖలు



ఖమ్మంస్పోర్ట్స్‌ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): పెవిలియన్‌గ్రౌండ్ ఇండోర్ స్టేడియం ఆలనా పాలనా లేక మూతపడింది. సుమారు రూ. కోటికి పైగా నిధులు ఖర్చు చేసి నిర్మించిన ఈ అధునాతన క్రీడాప్రాంగణం పదిసంవత్సరాలు కాక ముందే ఎవరికీ ఉపయోగపడకుండా నిష్ఫలంగా ఉంటోంది. పెవీలియన్‌గ్రౌండ్ ఇండోర్ స్టేడియంపై ఒక వైపు జిల్లా యువజన, క్రీడలశాఖ, మరోవైపు మున్సిపల్‌శాఖలు సమన్వయం చేసుకోక పోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని క్రీడాకారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దాని నిర్వహణ ఎవరు చేయాలో ఖచ్చితమైన ఆదేశాలు లేక పోవడంతో ఈ దుస్థితి ఏర్పడినట్లు పలువురు పేర్కొంటున్నారు.

గతంలో ఒక అవినీతి పరుడి చేతుల్లో..

ఇండోర్ స్టేడియం నిర్మించిన తొలి నాళ్లలో దాని బాధ్యతను అవినీతి పరుడైన ఒక ప్రేవేటు వ్యక్తికి అప్పగించారు. నాటి పాలకులు. సదరు ప్రైవేటు వ్యక్తి గతంలో బాస్కెట్‌బాల్ క్రీడా సంఘానికి సెక్రెటరీగా చాలా ఏళ్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయా క్రీడా సంఘం నుంచి తొలగించారు. అయినప్పటికీ అక్కడికి శిక్షణకు వచ్చే క్రీడాకారుల నుంచి నెలవారీ ఫీజులు వసూలు చేశాడు. ఆయా క్రీడాకరులను రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపిక చేస్తానని ప్రగల్భాలు పలుకుతూ భారీగా వసూలు చేశాడు. వచ్చిన నగదుతో కొంతమంది రాజకీయ నాయకులకు, పోలీసు పెద్దలకు అప్పుడప్పుడూ సన్మానాలు, కేక్ కటింగ్‌లు, మందు పార్టీలు ఇస్తూ ఇండోర్ స్టేడియాన్ని రాత్రి వేళల్లో పబ్బులా తయారు చేసేవాడు. ఇదంతా గమనించిన క్రీడాకారుల తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడకు శిక్షణకు పంపించడం మాన్పించారు. వారిని సర్దార్ పటేల్ స్టేడియానికి పంపడం ప్రారంభించారు. దీంతో క్రీడాకారులు ఎవరూ రాక ఇండోర్ స్టేడియం మూతపడిందని పలువురు పేర్కొంటున్నారు.



మందుబాబుల అడ్డాగా

పెవీలియన్ ఇండోర్ స్టేడియంలో శిక్షణకు క్రీడాకారులు ఎవరూ రాక మూతబడటంతో రాత్రి వేళ అది మందు బాబులు అడ్డాగా మారింది. కొందరు మద్యం తాగుతున్నారు. అక్కడ సెక్యూరిటీ వ్యవస్థ అందుబాటులో లేక పోవడంతో రాత్రి వేళల్లో అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం.

ఇతర క్రీడాంశాలకు కేటాయించాలి

పెవీలియన్ ఇండోర్ స్టేడియంలో విశాలమైన ఆటస్థలం అందుబాటులో ఉంది. ఈగ్రౌండ్‌ను మల్టీపర్పస్ స్టేడియంగా ఉపయోగించుకొనే వీలుంది. ఇప్పటికే సర్దార్ పటేల్ స్టేడియంలో ఇరుకైన శిక్షణ స్థలాల్లో క్రీడాకారులకు తర్ఫీదునిస్తున్నారు. ఏ క్రీడాంశానికైనా ఇండోర్ స్టేడియాన్ని అప్పగించాలని అధికారులను క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చెత్తా చెదారంతో ఉన్న స్టేడియం

పారిశుధ్య పర్యవేక్షకులతో కార్మిక నేత వివాదం

ఖమ్మంసంక్షేమ విభాగం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య అధికారితో ఓ కార్మిక సంఘం నాయకుడు బుధవారం సాయంత్రం సమయం గొడవకు దిగాడు. కార్మికుల హాజరుపై ప్రశ్నించటంతో ఈ వివాదం జరిగింది. కేఎంసీ కార్యాలయంలో ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం తమకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కొంతమంది కార్మికులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి కార్యాలయం ఎదుట, కమిషనర్ చాంబర్ ఎదుట బైటాయించి నిరసనలు చేపట్టారు. ఇటీవల కాలంలో వారంలో రెండు రోజులు కార్మికులు పెద్దసంఖ్యలో పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కేఎంసీ కార్యాలయానికి వచ్చారు. అయితే మంగళవారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారు హాజరు నమోదు చేసుకొని వచ్చారా లేదా సెలవ్ తీసుకొని వచ్చారా.. అనే విషయాలపై పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య కొంత మంది జవాన్లు వద్ద ఆరా తీశారు. విషయం తెలుసుకున్న ఓ కార్మిక సంఘం నాయకుడు బుధవారం సాయంత్రం కేఎంసీ కార్యాలయానికి చేరుకొని విధుల్లో ఉన్న పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య వద్దకు వెళ్లి ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయటంతో మరో ముఖ్యమైన నాయకులు సంఘటన ప్రాంతానికి చేరుకొని ఇరుపక్షాలను శాంతింపజేసి పంపించి వేశారు.

క్లీన్ సిటీ అవార్డుకు విద్యుత్‌శాఖ గండి

- ప్రధాన రహదారుల వెంట చెట్లు నరికి, అక్కడే వదిలేసి
- ఖమ్మం నగరంలో పర్యటిస్తున్న ఢిల్లీ బృందాలు
- విద్యుత్, కేఎంసీ, అటవీశాఖల మధ్య సమన్వయలోపం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హరితహారం పథకంలో భాగంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.కోట్లు వ్యయం చేసి గత పదేళ్లుగా మొక్కలు నాటారు. అలా నాటిన మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా మారాయి. వీధి వ్యాపారులకు నీడ, రహదారుల వెంట చల్లదనంతో బాటసారులు, వాహనదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. అలా పెరిగిన వృక్షాలు ఇప్పుడు నగరంలోని విద్యుత్ తీగలకు అడ్డంగా మారుతున్నాయి. ఈ కారణంతో గత పక్షం రోజులుగా ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారుల నుంచి మారుమూల వీధుల వరకు కొన్ని వందల వృక్షాలను విద్యుత్‌శాఖ ఉద్యోగులు స్పెషల్ డ్రైవ్ పెట్టి నరికేశారు. అయితే విద్యుత్ తీగలకు సమీపంలో కాకుండా పనిలో పనిగా వృక్షాలు తిరిగి ఎదగకుండా కాండం వరకు విద్యుత్ పరికరాలను వినియోగించి కట్ చేస్తున్నారు. అలా నరికిన వృక్షాల కొమ్మలను అక్కడే పడవేసి విద్యుత్‌శాఖ ఉద్యోగులు చేతులు దులుపుకొంటున్నారు.

క్లీన్ ఖమ్మం అవార్డుకు గండి...

ఖమ్మం నగరంలో రెండు ఢిల్లీ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. బహిరంగ మల మూత్ర విసర్జన రహిత ఓడీఎఫ్ ప్లస్, ప్లస్‌తో పాటుగా పరిశుభ్రమైన (గార్బేజ్ క్లీన్ సిటీ) అవార్డు కోసం రెండు బృందాలు ఖమ్మం నగరంలో పరిశీలన చేస్తున్నాయి. అవార్డుల కోసం ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు అన్ని సిద్ధం చేశారు. కాని విద్యుత్‌శాఖ అధికారులు కనీసం అనుమతి లేకుండా ఇష్టారీతిగా ప్రధాన రహదారుల వెంట వృక్షాలను నరికి అక్కడే కొమ్మలను వదిలి వెళ్తున్నారు. దీంతో ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి రెండో పట్టణ పోలీసుస్టేషన్ వరకు, వైరా రోడ్డు, ఖమ్మం బైపాస్ రోడ్డు, ప్రకాశ్‌నగర్ రోడ్డు, త్రీటౌన్ ప్రాంతం, వీడీవోస్ కాలనీ ఇలా అన్ని ప్రధాన రహదారుల వెంట నరికి పడేచి ఎండిపోయిన వృక్షాల వ్యర్థాలు రహదారి వెంట కనిపిస్తున్నాయి. ప్రకాశ్‌నగర్ రోడ్డులో టింబర్ మార్టు షాపులు ముందు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సమన్వయం లేని అధికారులు

పక్షం రోజులుగా ఖమ్మం నగరంలో విచ్చలవిడిగా వృక్షాలను కట్ చేస్తున్నా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు కానీ, అటవీశాఖ అధికారులు కానీ పట్టించుకోవటం లేదు. తమ పరిధిలో లేదని కేఎంసీ అధికారులు తప్పించుకుంటున్నారు. రాత పూర్వకంగా ఫిర్యాదులు రాలేదని అటవీశాఖ అధికారులు స్పందించటం లేదు. ఏది ఏమైనా క్లీన్ సిటీ ఖమ్మం అవార్డు ఎంపిక కసరత్తు జరుగుతున్న తరుణంలో ఇలా రహదారుల వెంట వృక్షాల వ్యర్థాలతో అవార్డుకు గండి పడే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు.



కొమ్మలను నరికివేస్తున్న దృశ్యం

వర్షపు నీరు నిల్వకుండా నిర్మించాలి

- కమిషనర్ అభిషేక్ అగస్త్య
- 19, 49 డివిజన్‌లో పర్యటన

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అధికారులు చేపట్టే పనులు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. బుధవారం నగరంలోని 19, 49 డివిజన్లలో కమిషనర్ పర్యటించారు. 49వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లుతో కలిసి వీధులను పరిశీలించారు. రామాలయం రహదారి వెంట వర్షపు నీరు నిల్వటాన్ని పరిశీలించారు. కొత్త ఎన్‌జీబీ బ్యాంకు నుంచి పాత ఎన్‌జీబీ వరకు రూ.60 లక్షల పనులు చేపట్టాలని ఆదేశించారు. అండర్‌బ్రిడ్జి వద్ద ఓపెన్‌జిమ్, పార్కు నిర్మాణం చేయాలన్నారు. డివిజన్‌లో15 విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ప్రారంభించిన పనులు జూన్ 15 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారులు, డ్రెయినేజీలు ఎత్తుగా నిర్మాణం చేయటం ద్వారా వర్షాకాలంలో నీరునిల్వలు ఏర్పడతాయన్నారు. డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



49వ డివిజన్‌లో సమస్యలపై కార్పొరేటర్‌తో మాట్లాడుతున్న కమిషనర్

నేడు బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం

తిరుమలాయపాలెం,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్స సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం తిరుమలాయపాలెంలో నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న తెలిపారు. సాయంత్రం 3గంటలకు కొక్కిరేణి స్టేజీసమీపంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేల సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేదంర్‌రెడ్డి హాజరువతారన్నారు. ఈ సమావేశానికి నాలుగుమండలకు చెందిన పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గాలివానకు రోడ్డుపై విరిగిపడిన చెట్టు



మధిర రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి వచ్చిన గాలిదుమారానికి రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. మధిర-తిరువూరు ప్రధాన రహదారిలో ఆత్కూరు, ఖాజీపురం గ్రామాల మధ్య మర్రిచెట్టు విరిగి పడిపోయింది. దీంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అధికారులు రోడ్డుపై పడిన చెట్టను తొలగించారు. నిదానపురం గ్రామంలో గాలిదుమారానికి మొక్కజొన్న చేలు నేలవాలాయి.



కల్లూరులో నేలవాలిన వరిని కోయిస్తున్న రైతు



కొణిజర్ల మండల పెద్దగోపతిలో అకాలవర్షానికి నేలమట్టమైన వరి



తల్లాడలో పట్టాలపై వర్షపు నీరు



బోనకల్‌లో తడిసిన మొక్క కంకులు

అకాల వర్షాలతో అదనపు నష్టం

- పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు వర్షం
- 5 వేల ఎకరాల్లో పూర్తిగా నెలవాలిన వరి

కల్లూరు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఈ యాసంగి సీజన్‌లో వరి కోతలు ప్రారంభంతో పాటుగా దిగుబడి అయిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకుందామని రైతు లు ఎంతో సంబర పడ్డారు. ఈ పరిస్థితుల్లోనే ధాన్యం రైతులకు వరసగా ఆకాల వర్షాలు, ఈదురు గాలులు పది రోజుల వ్యవధి లోనే నాలుగు సార్లు వెంటాడాయి. కోతకు వచ్చిన వరి వేలాది ఎకరాల పంట పూర్తిగా నేలవాలంది. ఇది రైతులకు తీవ్రమైన ఆర్థిక భారంగా మారింది. ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి ఆరబెట్టాగా వరస ఆకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయినాయి. ఈ పరిస్థితి దృష్ట్యా ధాన్యం రంగు మారకుండా, తేమ శాతం తగ్గేలా తడిసిన ధాన్యాన్ని రైతులు గత పది రోజుల నుంచి దంతేలతో తిరగదోడే పనిలో ఆరుగాలం శ్రమిస్తున్నారు. వాస్తవంగా వాతవరణం పొడిగా ఉండే రైతులకు పై విధంగా ఇన్ని రకాల ఇబ్బందులు ఉండేవి కావు. వరి సాగులో వాస్తవంగా పెట్టాల్సిన పెట్టుబడి కంటే ప్రకృతి వైపరిత్యంతో రైతుకు అదనపు ఆర్థిక భారం పడింది.

ఎకరానికి రూ. 12 వేల భారం

అకాల వర్షాలు వరుసగా వెంటాడటంతో కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు పూర్తిగా నేల వాలింది. మరో వైపున వరి మడులలో మోకాలు లోతు వరద నీరు చేరింది. ఈ పరిస్థితుల్లో యంత్రాలతో వరి కోతలకు అంతరాయం కలిగింది. వాతవరణం పొడిగా ఉంటే ఎకరం వరి కోత గంట సమయం పట్టేది. అలాంటిది వరి మడులలో వరద చేరి బురదగా ఉండటంతో చైన్ మిషన్లతో వరి కోత మూడు గంటలకు పైగా సమయం పట్టుతుంది. గతంలో గంటకు అద్దె రూ. 3500 కాగా, అది ఇప్పుడు ఎకరాకి రూ.10 వేలు అయింది. దీనికి తోడుగా కేంద్రాల్లో వరస ఆకాల వర్షాలకు తడిసి ధాన్యం రంగు మారకుండ దంతేలతో దశల వారిగా తిరగదోడాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో రైతులకు అదనపు శ్రమగా పని భారం పెరిగింది. ఉదయం నుంచి సాయింత్రం వరకు ప్రతి రోజు రైతు కుటుంబ సభ్యులు తమ గృహాలకు దూరంగా ఉంటూ ఇదే పనిలో నిమగ్నమైనారు. ఇక కల్లాలో ధాన్యం రాశులను తిరగదోడేందుకు కూడా కూలీలకు గాను ఎకరానికి రూ. 2 వేలు అదనపు ఆర్థిక భారం పడింది. ఈ యాసంగి సీజన్‌లో ప్రకృతి వైపరీత్యంతో ప్రధానంగా కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ధాన్యం కొనుగోలు వేగంగా జరపాలి



మేకల కృష్ణ రైతు కల్లూరు

ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కేంద్రాలు సకాలంలో ప్రారంభించి ఉంటే రైతులకు అంతగా నష్టం వాటిల్లేది కాదు. ఆకాల వర్షాలు, ఈదరు గాలుల బీభత్సంతో రైతుకు పలు విధాల నష్టంతో ఆర్థిక భారం కూడ పెరిగింది. వరి మడులలో వరదనీరు చేరటంతో యంత్రాల అద్దె రెండు రెట్లు పెరిగింది. మరో వైపున రైతుకు శ్రమ రెట్టింపు అయింది. రైతులు మానసికంగా వత్తిడికి గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేలా సత్వరమే ధాన్యం కేంద్రాల్లో అదనంగా మిల్లర్లను కేటాయిస్తే కొనుగోలు ప్రక్రియ వేగం జరగుతుంది.

ఒక్కో రైతుకు రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలి

- కాంగ్రెస్ నాయకుడు సూరపనేని రామారావు



నష్టపోయిన రైతు పొలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్‌నేత సూరపనేని

వైరా, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): వైరా మండలం రెబ్బవరం రెవెన్యూ గొల్లపూడి గ్రామపరిధిలోని రొంటే హనుమంతుకు చెందిన ఎనిమిది ఎకరాల వరిపంట అకాల వర్షంతో నేలకువరిగి తీవ్రనష్టం జరిగింది. విషయం తెలుసుకున్న వైరా వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూరపనేని రామారావు బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతు హనుమంతుకు రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

పంట పొలాల పరిశీలన

వైరా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూసలపాడు గ్రామంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను బుధవారం వైరా డివిజన్ ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ పరిశీలించారు. నష్టం జరిగిన ప్రతి రైతుల పొలాన్ని ఏఈవోలు పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ముంజుఖాన్, కీర్తి, గుండ్ల రాములు, ఇజ్జగాని రాంబాబు, బొడ్డు లక్ష్మణరావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో నష్టం

కొణిజర్ల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కరుణించకపోయినా వరుణుడు కరుణించాడని అంటున్నారు. ఈదురుగాలులతో నష్టపోయామని, తాలు వచ్చి ఎకరానికి 20 బస్తాలైనా వస్తాయోరావోనని వాపోతున్నారు.

200 ఎకరాల్లో వరి నేలమట్టం



తడిసిన మొక్కజొన్నను ఆరబోస్తున్న బస్వాపురంలోని రైతు

కొణిజర్ల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అకస్మాత్తుగా సంభవించిన ఈదురుగాలులతో కూడిన అకాలవర్షానికి అన్నదాతకు తీవ్రనష్టం వాటిల్లింది. చేతికొస్తున్న వరి పంట కాస్త నేలకొరిగింది. అకాలవర్షం కాస్త నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షంతో మండలంలోని పెద్దగోపతి, పెద్దమునగాల, చిన్నమునగాల, కాచారం, కొణిజర్ల, కొండవనమాల తదితర గ్రామాలలో చేతికొచ్చిన వరిపంట సుమారు 200 ఎకరాలకు పైగా నేలమట్టమైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ రెక్కలకష్టం మొత్తం నేలపాలైందని, ప్రభుత్వం అకాలవర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టపోయిన గ్రామాలలో సమగ్ర సర్వే నిర్వహించి ప్రతీ రైతుకు నష్టపరిహార అందేలా చూడాలని కోరుతున్నారు. వారం పది రోజుల్లో పంటకు సంబంధించిన డబ్బులు వస్తాయని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది.

గాలి దుమారంతో ఉక్కిరిబిక్కిరి

- అర్ధరాత్రి కల్లాలకు ఉరుకులు, పరుగులు

బోనకల్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం అర్ధరాత్రి వీచిన గాలి దుమారంతో మక్క రైతులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పగలంతా గింజలను కల్లాల్లో ఆరబోసి, తిరిగి వాటిని పోగేసి పట్టాలు కప్పి ఇంటికి వచ్చారు. అనుకోని విదంగా వచ్చిన గాలి దుమారం, వర్షపు జల్లులతో రైతులంతా కల్లాలకు పరుగులు తీశారు. గాలికి కప్పిన పట్టాలు లేచి పోతుండటం, వాటిని తీసుకొచ్చి మరల కప్పి బరువులు పెట్టడానికి రైతులు నానా అవస్తలు పడ్డారు. గింజలను తడవకుండా కాపాడుకునేందుకు రాత్రంతా జాగారం చేశారు. కొందరి రైతుల మక్క కంకులు కల్లాల్లోనే తడిచి పోయాయి. గింజలకు పట్టాలు కప్పి ఎలాగో కాపాడుకున్నా, పొలంలో మిషన్ పట్టగా మిగిలిన కంకులను కల్లాల్లో చేర్చుకోగా అవి తడిచి పోయాయి.



పట్టాలు కప్పిన రైతులు

తోటల్లో నేల రాలిన మామిడి

చింతకాని, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మంగళవారం అర్ధరాత్రి వచ్చిన ఈదురుగాలులకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల పంటలకు అపారనష్టం వాటిల్లింది. తిమ్మినేనిపాలెం, సీతంపేట, నాగులవంచ గ్రామాల్లో మామిడి తోటల్లో పండ్లు నేలరాలాయి. కోతకు వచ్చిన వరి పంట నేల కొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లోని మిర్చి, మొక్కజొన్న పంటలు అకాల వర్షానికి తడిశాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నేలరాలిన మామిడి పండ్లు



వెంకటగిరిలో కల్లంలో తడిసిన ధాన్యం

కొనుగోలులో జాప్యం రైతులకు శాపం

తల్లాడ, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసి నష్టం వాటిల్లింది. తల్లాడ మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి అమ్మకానికి సిద్ధంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లోని కల్లాలో ధాన్యం తడిసిపోయింది. వారం వ్యవధిలో మాడు సార్లు కురిసిన వర్షానికి నూర్పిళ్ల చేసిన కొనుగోలు కేంద్రాలలోని కల్లాలో ధాన్యం తడిసి పోవటం, కోతకు వచ్చిన వరి పైరు నేలమట్టం కావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండంలోని గొల్లగూడెం, తల్లాడ, వెంకటగిరి, నూతనకల్లు తదితర కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ధాన్యం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు

ఆడబిడ్డను బాధ్యతగా పెంచుదాం: కమిషనర్



ఆడబిడ్డకు జన్మనిచ్చిన దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సత్తుపల్లి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డ జన్మిస్తే భారంగా కాకుండా బాధ్యతగా పెంచి బంగారు భవిష్యత్తును ఇవ్వాలని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహా అన్నారు. మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఆడిబడ్డకు జన్మనిచ్చిన స్థానిక వెంగళరావు నగర్‌లోని శ్రీనివాసరావు, కల్యాణి దంపతులను ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం మిఠాయిలు పంచి శాలువాతో ఘనంగా సన్మానించి ప్రశంసపత్రం అందించారు. సమాజంలో మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుంటున్నారని, పిల్లలను చదివించి ఉన్నతస్థాయిలో ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పీ.సునీల్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ, సూపర్‌వైజర్ రజిని, కంటె నాగలక్ష్మి, విజయమ్మ, రాణి, ఉష పాల్గొన్నారు.

మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ చేయండి

- ఏఎంవో రవి కుమార్

బోనకల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పరీక్షల మూల్యాంకనాన్ని పూర్తి చేసి వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఏఎంవో రవి కుమార్ ఆదేశించారు. మండలంలోని రావినూతల. కేజీబీవీ, గురుకుల బాలికల పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేది నాటికి ఎస్ఏ2 పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ నెల 22వ తేదిన నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో ప్రగతి పత్రాలను డౌన్లోడ్ చేసి వారికి అందజేయాలని సూచించారు.



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఏఎంవో

సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

- రాజకీయ, ముస్లిం నాయకుల తీర్మానం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని రాజకీయ, ముస్లిం నాయకులు తీర్మానించారు. బుధవారం స్థానిక జామె మసీద్‌లో వక్ఫ్ సవరణ బిల్లు-2025కు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. దేశంలో ముస్లింలు, క్రిష్టియన్లను అణిచివేసే విధంగా అనేక చట్టాలను రూపొందించిన కేంద్రం మత దాడులు చేయిస్తుందన్నారు. వారి అభివృద్ధికి పాటుపడతామని చెప్పుకునే ఎన్‌డీఏ పక్షాలు తమతమ క్యాబినెట్‌లో ఒక్క ముస్లిం మినిస్టర్ లేడని, కనీసం ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదని, దీంతో బీజేపీకి ముస్లింలపై ఉన్న ప్రేమ ఏమిటో అర్థమవుతుందన్నారు. ఇలా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజాస్వామ్య పార్టీలు చూస్తూ ఊరుకోవని, ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేవరకు ఐకమత్యంతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, మోరంపూడి పాండు, రావుల రాజబాబు, దండు ఆదినారాయణ, మజీద్ సదర్ ఎస్‌కే.నాయబ్ రసూల్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ముస్లిం, రాజకీయ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

అధ్వాన పారిశుధ్యంపై నిరసన

వైరా, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 9వార్డులో మధిరవెళ్లే ప్రధాన రహదారి పక్కన పారశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, అక్కడ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు బుధవారం నిరసనకు దిగారు. ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంద, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ రింగ్ రోడ్డు సెంటరు నుంచి సోమవారం గ్రామం నేషనల్ హైవే రోడ్డువరకు వరకు రూ.12కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు మంజూరు అయిందని, సంవత్సరం గడుస్తున్న నేటికి పనులు పూర్తి కాలేదన్నారు. ప్రధాన రహదారి పక్కనే డ్రెయినేజీ తొలగించడంతో ఆర్టీసీ బస్టాండ్ ఏరియా నుంచి మధిర రోడ్డు వైపు నుంచి వచ్చే మురుగు నీరు నివాస ప్రాంతాలలో నిలిచిపోవడంతో 9వార్డు ప్రాంతం మురికి కూపంగా మారిందని వాపోయారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో వెంకటేశ్వర్లు ప్రతిభ



మధిర రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి పవర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో అండర్- 17 విభాగంలో మధిర సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి వి.వెంకటేశ్వర్లు సిల్వర్ మెడల్ సాధించినట్టు స్కూల్ హెచ్‌ఎం ఆన్‌బేబి తెలిపారు. ఈవిద్యార్థి 19న నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

తల్లిపాలు, సమతుల ఆహారం తప్పనిసరి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు తప్పనిసరని, తల్లులు ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ అన్నారు. బుధవారం మండలంలోని జగన్నాథపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఆహారాల వంటల ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా తెలుగునాటకరంగ దినోత్సవం

మధిర రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగునాటకరంగ దినోత్సవంను బుధవారం మధిరలో శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గద్దం సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయప్రాంగణంలో సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎర్రుపాలెం/ వైరా, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామునూరు, బనిగండ్లపా డు, జమలాపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేద్రాలను ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు బుధవారం ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు.

వైరా మండల పరిధిలోని ముసలిమడుగు, గన్నవరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కేవీ శ్రీనువాసరావు ప్రారంభించారు.

గురువమ్మతల్లికి బోనాలు

కారేపల్లి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో జరుగుతున్న గురువమ్మతల్లి జాతరలో భాగంగా బుధవారం ప్రభలతో పాటు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

గేదె, ఐదు గొర్రెల మృత్యువాత

కల్లూరు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి) చెన్నూరు గ్రామంలో విద్యుత్‌షాక్‌తో రూ.లక్ష విలువ గల ఓ పాడి గేదే మృత్యువాత పడింది. చెన్నూరు గ్రామానికి చెందిన ఏలూరి వెంకటారామారావు అనే రైతుకు చెందిన పాడి గేదే గ్రాసం కోసం మామిడి తోట వద్దకు వెళ్లగా, ఆ సమయంలో పాడి గేదేకు విద్యుత్ షాక్ గురియై అక్కడిక్కడే మృతి చెందింది. ఆ తరువాత మరో ఐదు గొర్రెలు కూడా అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.

ప్రమాదాలపై ఆందోళన వద్దు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై ఆందోళన వద్దని, అప్రమత్తతోనే మంటలను ఆర్పివేయడంతో పాటు తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని సత్తుపల్లి ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కిష్టారంలోని మహాలక్ష్మి సింగరేణి క్యాంప్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.